# కాన్వకేషన్ గౌన్

వెయ్యిల్ల రామాయణం ఏం బావుందండీ... అన్నాడు నా యెదుట ఆయన ఒహో అట్లాగేం....

దాంతో ప్రారంభమయింది తగాదా. ఏమీ మాట్లాడకుండా కూర్చున్నవాళ్ళల్లో నేనొకణ్ణి. అందరూ విస్తుపోయి చూస్తున్నారు. ప్రతీదానికీ పోటీలు పెట్టుకుని ముఖాముఖి నానామాటలు అనుకుంటున్నారట. నా ప్రక్కనున్నాయన నా చెవిలో ఊదేసరికి.... అమ్మబాబోయ్ అనుకున్నాను. ఎంత ధైర్యంగా మాట్లాడుతున్నదీ అనుకున్నాను. వాదన అంతా అయింతరువాత మీ ఆర్గుమెంటులో అర్థంలేదు. మీతో వాదించటం చాలా అనవసరం అంటూ ప్రక్కకుతిరిగి కూచుంది. ఎదట ఉన్నాయన నోర్మూసుకుని కూర్చున్నాడు. ఆవిడకీ ఆయనకూ ఏవిటి సంబంధం. ఎంతో ఆప్తులులా మాట్లాడుకుంటున్నారు అన్నది నాకు నిజానికి సమస్య అయింది.

ఆ అమ్మాయితో మాట్లాడాలని ముచ్చటగా వుంది నాకు. ఆ అమ్మాయి కళ్ళు అందర్నీ ఆకర్షిస్తున్నాయి. నన్నూ. బెదురులేకుండా ఖచ్చితంగా మాట్లాడుతున్నది. నాకు విజయలక్ష్మి పండిట్ జ్ఞాపకానికి వచ్చింది. కనీసం కాలేజీచదువైనా కొంత అబ్బి వుండాలి ఆవిడకి అనే నిశ్చయానికి వచ్చింతరువాత మీరేవూరునుండి వస్తున్నారని అడిగాను. కాకినాడ అని

చెప్పింది. ఆవిడతో రాజకీయాల్ని గురించి మాట్లాడితే ఎట్లా వుంటుందో అని. బోసువీరుల విచారణగురించి మీ అభిప్రాయ మేమిటి అన్నాను. వాళ్ళు నిజమైన దేశభక్తులు అని అనటా నికి నేను వెనుదీయను అన్నది. పత్రికల్లో ప్రకటించిన కెప్టెన్ లక్ష్మి ఫోటో నా కళ్ళల్లో మెదిలి - ఆవిడ ఇట్లాగే ఉంటుందేమో అనిపించింది. కెప్టెన్ లక్ష్మి నా ప్రక్కన కూచుని నాతో మాట్లాడుతున్నట్టుగా వుంది. ఇది సైకాలజో, ఫిలసఫో, నా కర్థంకాలేదు. మేం ఇద్దరం మాట్లాడుకుంటుంటే మా వైపు విరగబడి చూస్తున్నారు జనం. రైలు మాత్రం నాదోవ నాది అనుకుంటూ పోతున్నది.

మీరు ఎక్కడికి వెళ్తున్నారని నన్నడిగిన ప్రశ్నకు గుంటూరువరకే కొంచెం అక్కడ పని ఉన్నది అని చెప్పాను. నేనూ అక్కడికేనండోయ్ అని అన్నది నవ్వుతూ. ఎంతో హాయిగా ఉంది ఆవిడ నవ్వుతూంటే. ఇంకా నవ్వుతుందేమో అని చూశాను. చప్పున ఆపేసింది సీరియస్‌గా. మీరు ఇందాక వాదిస్తున్నారే ఆయనెవరండీ అని అడిగాను. "ఆయన ఒక ఉభయభాషా ప్రవీణ. కాన్వకేషన్‌కు వెళ్తున్నాట్ట. ఒక్కటే మొండివాదన" అన్నది నెమ్మదిగా నాతో.

రైలు గుంటూరులో ఆగేంతవరకూ ఏదో లోకాభి రామాయణం మాట్లాడుతునే ఉన్నాం.

ఇంతకూ విచిత్రమైన విషయమేమిటంటే ఇద్దరమూ ఒక పనిమీద ఒకే చోటుకు, ఒకే రైలుపెట్టెలో ఎక్కి కలుసు కుని పోవటం తటస్థించింది. ఆ కాస్త పరిచయం స్నేహంగా

మారటంలో విశేషం లేదు.

రైలు దిగింతరువాత మీ రెక్కడికి వెళ్తారు అని అడిగింది. నాకో స్నేహితుడు ఉన్నాడు అతనింటికి వెళ్తాను రమ్మని ఉత్తరంకూడా వ్రాశాడు అన్నాను. నేనూ నా స్నేహితురాలింటికి వెళ్తాను అన్నది. కాదుగూడదు మీరు నాతో రావాలి అతిధులు మీరు అన్నాను. సంతోషపూర్వకంగా తల వూగించిన తరువాత ఇద్దరమూ ఒక జట్కాలో ఎక్కాం. అంత ఇరుకుగా కూర్చోనక్కరలేదు. ఫరవాలేదు జరగండి అన్నది. అబ్బో చాలా 'Advaned' అని మనసులో అనుకుని డిగ్రీ పుచ్చుకున్నారుగదా మీరేంచేస్తారన్నాను. అదే ఆలోచిస్తున్నానండీ అన్నది నవ్వుతూ. ఆవిడ నవ్వుతుంటే చూడటం ఇది రెండోసారి. నన్ను అదేప్రశ్న అడుగుతుందనుకున్నాను. కాని ఆవిడ నన్ను వేసిన ప్రశ్నకు ఆశ్చర్యపోయినాను.

బండి దిగింతరువాత మా సూరికి పరిచయం చేశాను ఆవిడ్ని. ఇద్దరమూ మావాడింట్లోనే భోజనం చేశాం. అంతా అయినతరువాత సూరి పెళ్ళాంతో కబుర్లుపెట్టింది. ఏదో చెప్తున్నది. నవ్విస్తున్నది. ఇద్దరూ నవ్వుకుంటున్నారు. సావిట్లో,, కూచుని నేనూ సూరి మాట్లాడుకుంటున్నాం. "ప్రాక్టీసు అట్టే లేదిపుడు కొంచెం తగ్గినట్లు కన్పిస్తుంది అన్నాడు సూరి.

కాన్వకేషన్‌కు వెళ్ళటానికి గౌను తగిలించుకుని వెళ్ళాలి. అ గౌనుకోసరం చాలామంది అవస్థలు పడ్తున్నారు అందరూ అటూ ఇటూ తిరుగుతున్నారు. కాస్త హడావిడిగా

వుంది. నేను ఆ అవస్థలు పడక్కరలేదు. మావాడి ప్లీడరు గౌను వేసుకోంటాను నాతోకూడా వచ్చిన అమ్మాయికి గౌను వుందో లేదో ఎక్కడైనా ఏర్పాటుచేద్దాం అనిపించింది... అయినా ఆడవాళ్ళకు గౌనులెందుకూ అనుకున్నాను.

కాన్వకేషన్ సరిగ్గా మూడు గంటలకు, అందరం రెండున్నరకే అక్కడకు తయారుగావాలని మాకిచ్చిన కార్డుల్లో అచ్చుకొట్టారు. అప్పుడే ఒకటిన్నర అయింది. మాసూరి, పెళ్ళాంచెవిలో ఏదో వూది, ఫలహారాలు చేయించ మన్నాడు. ఇదోటి ఎందుకండి ఇప్పుడు అంటే, ఊరుకోలేదు. గౌను సంగతి హెచ్చరించలేదు నేను. రెండు కొట్టింతరువాత అన్నాను నేను. టైము అయింది ఇహాలేవాలి అని చావుకబురు చల్లగా అపుడు చెప్పాడు. వాళ్ళ మేనల్లుడు (ఈ మధ్యన బి యస్ సి ప్యాసయినవాడు) వచ్చి గౌను పొద్దునే పట్టుకు పోయాట్ట నాకు విపరీతమైన కోపం వచ్చింది. సూరి అమాంతం నన్ను మోసంచేశాడు. నిజానికి తప్పునాది కారణం ఏమంటే నాకు గౌను కావాలి అని ముందుగా తెలియపర్చలేదు. మన వాడిది ఉందిగదు వేసుకోవచ్చుకదా అనుకున్నాను. ఇంతలో సూరి పెళ్ళాం ఇవతలకువచ్చి ఈ అమ్మాయి మనకు చుట్ట ముండోయ్ అన్నది సూరితో. "ఆ అమ్మాయి మనకు చుట్ట మయితే ఏం కాకపోతే ఏం నాకిప్పుడు గౌను కావాలి కాన్వకేషను గౌను. అది తగిలించుకునిపోయి ఆ బియ్యే డిగ్రీ తీసుకోవాలి" అన్నాను. ఫరవాలేదు. గాబరాపడకు

అన్నాడు సూరి. నాకు టైమయిపోతున్నది చాల చికాకుగా వుంది. నేనిట్లు అవస్తపడుతుంటే వాళ్ళిద్దరూ, కాదు ముగ్గురు (ఆ అమ్మాయికూడా) ఎకసెకలు పకపకలూ వళ్ళు పళ్ళు పట పట కొరికాను. ఇహ బజార్నపడితే ఎక్కడన్నా దొరుకు తుందేమో సంపాయించచ్చు అనుకున్నాను.

పట్టుమని పది నిముషాలన్నా టైములేదు. ఈ లోపల నాకు గౌను దొరకాలి ఆ గౌను తగిలించుకుని ఆ కాన్వకేషనుకు వెళ్ళి డిగ్రీ తెచ్చుకోవాలి ఇది చాలా చిక్కు సమస్య.

నల్లచీర తీసుక వెళ్ళండి అని సూరి పెళ్ళాం వాళ్ళు వేళాకోళం చేయటం మొదలుపెట్టారు.

ఛీ చీదరించుకున్నాను.

అంతకన్నా చేయదగ్గది నాకేం కనిపించలేదు అన్నాడు సూరికూడా.

నేను కాన్వకేషనుకి పోవటం మానేస్తాను. వచ్చే సంవత్సరం తెచ్చుకుంటాను. బతికి బాగుంటే అన్నాను.

కాస్సేపటికి సూరి పెళ్ళాం బయటకువచ్చి మునిముని నవ్వులు నవ్వుతూ ఆ బల్లమీద పెట్టిపోయింది గౌను. సూరి పక్కున నవ్వాడు.

ఇదంతా మీ స్నేహితురాలు ఆడిన నాటకంగా అన్నాడు. ఆవిడ దాచిపెట్టి (వంట ఇంట్లోచేరి) ఇట్లు చేసింది ఈ చిలిపిపనుల్లో సూరి పెళ్ళాము, ఈవిడా కలిశారు.

ఇట్లు చేసినందువల్ల మీకేం జరిగింది అన్నాను. అందరమూ నవ్వుకున్నాం.

గౌను తగిలించుకున్నాను.

ఆవిడకూడా వచ్చింది.

ఇద్దరమూ కలసి కాన్వ కేషన్‌కు వెళ్ళాం. దోవలో మొల్ల రామాయణం ఏం బావుందండీ, అని అన్నాను. ఉభయ భాషా ప్రవీణకండి మీరుగూడా అని అన్నది. "నా స్నేహితు రాలి దగ్గరికి వెళ్తున్నాను." కాన్వ కేషన్ నుండి వచ్చి. తరు వాత మీకు కన్పించటానికి అవకాశం వుండదు" అని నవ్వుతూ అనేటప్పటికి.

"అట్లా ఎన్నటికీ జరగటానికి వీలులేదు. రాత్రికి మనం అందరం సినిమాకు వెళ్ళాలి. సూరి పెళ్ళాం మిమ్మల్ని వదలిపెట్టదండోయ్" అన్నాను.

హాల్లో ప్రవేశించబోతూ "గౌను దాచిపెట్టి వన్ను చాలా అల్లరి పెట్టాశారే" అన్నాను.

కాన్వ కేషన్‌నుంచి వచ్చింతరువాత అందరము సినిమాకు వెళ్ళాం.

సినిమానుండి తిరిగివస్తూంటే.

"ఒరే ఆవిడ మా పెదమామగారి అల్లుడి చెల్లెలు." అన్నాడు.

'అయితే ఆ అల్లుడు మా మేవత్త కొడుకేగా' అన్నాను.

మనం అందరం ఒకే బంధుకోటిలోని వాళ్ళం అన్నది ఆవిడ.

నేను ఇంటికి తిరిగి వెళ్ళిందాకా ఆవిడ నవ్విన నవ్వు ఇంకా వినపడుతునేవుంది. ఆవిడను పక్కనే ఉన్నట్టు 'ఛీ' అనుతున్నాను. చాలా తమాషాగా వుంది !

ప్రజాబంధు

)o(